సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం । 12 । మే । 2024





పిఠాపురం సభకు తరలివచ్చిన జనంలో ఒక భాగం



ఎన్నికల ప్రచార సభలో వైఎస్సార్ సీపీ గుర్తు సీలింగ్ ఫ్యాన్‌ను ప్రజలకు చూపుతూ ఓట్లు అభ్యర్థిస్తున్న సీఎం జగన్. చిత్రంలో సిట్టింగ్ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పార్టీ కాకినాడ ఎంపీ, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, వంగా గీత

పిఠాపురంలో జనసునామీ

- సీఎం జగన్‌కు అఖండ స్వాగతం
- జోష్ నింపిన జననేత ప్రసంగం
- ప్రజల్లో ఉరకలెత్తిన ఉత్సాహం
- 'మళ్లీ మీరే సీఎం' అంటూ మిన్నంటిన నినాదాలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దేశంలోని మూడు గయా క్షేత్రాల్లో.. అష్టాదశ శక్తి పీఠాల్లో.. పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా.. దత్తాత్రేయుని అవతారమైన శ్రీపాద శ్రీవల్లభ స్వామి అవతరించిన పుణ్యభూమిగా.. ఎన్నో ఆలయాలకు, పీఠాలకు, ఆశ్రమాలకు నెలవైన పిఠాపురం పట్టణాన్ని శనివారం సాయంత్రం జనసునామీ ముంచెత్తింది. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలకమైన ఎన్నికల ప్రచారానికి ఇక్కడి సభతో ముంగింపు పలికిన వేళ వేలాదిగా ప్రజావాహిని కదం తొక్కింది. అశేషంగా తరలి వచ్చిన జనసందోహంతో పిఠాపురం పట్టణ వీధులు, ఉప్పాడ సెంటర్ కిక్కిరిసిపోయాయి. సభ ఆద్యంతం జనం 'జై జగన్' నినాదాలతో హోరెత్తించారు. 'సీఎం, సీఎం.. మళ్లీ మీరే సీఎం' అంటూ యువత, మహిళలు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. తమ ప్రియ నేతకు అఖండ స్వాగతం పలికారు.

ఉత్సాహ తరంగమై..

మధ్యాహ్నం 3 గంటల వరకూ నడినెత్తిన సూరీడు చండప్రచండంగా నిప్పులు చెరుగుతూండటంతో జనం అల్లాడిపోయారు. అయినప్పటికీ తమ ప్రియతమ నేతను కళ్లారా చూసేందుకు మొక్కవోని పట్టుదలతో ఉప్పాడ సెంటర్‌లో వేచి ఉన్నారు. వైఎస్ కుటుంబానికి, వరుణుడికి అనుబంధం ఉందన్న నానుడిని నిజం చేస్తున్నట్టు.. అప్పటి వరకూ తీవ్రంగా ఎండ కాయగా.. సాయంత్రం నాలుగు గంటలయ్యేసరికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కైకలూరు నుంచి పిఠాపురం పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు సీఎం జగన్ సరిగ్గా సాయంత్రం 4.15 గంటలకు చేరుకున్నారు. ఆకాశంలో సీఎం హెలికాప్టర్‌ను కనిపించగానే జనం ఎండ బాధ మరచిపోయి.. ఉత్సాహంతో ఉరకలెత్తారు. హెలికాప్టర్ వద్ద ఆయనకు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి సభాస్థలికి బస్సులో బయలుదేరిన సీఎం జగన్.. దారి పొడవునా ప్రజలకు అభివాదం చేసుకుంటూ వెళ్లారు. బయట రోడ్డుకు ఇరువైపులా వేలాదిగా బారులు తీరిన జనం ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. జననేతపై అభిమానంతో 'సీఎం.. సీఎం' అంటూ బస్సు వెంట పరుగులు తీశారు. వెల్లువెత్తిన జనంతో ఉప్పాడ, కత్తిపూడి, కాకినాడ ప్రధాన రహదారులు ట్రాఫిక్‌తో స్తంభించిపోయాయి.

ఆలోచింపజేసిన సీఎం ప్రసంగం

ఉప్పాడ సెంటర్‌లోని సభా వేదిక వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి జగన్ 4.26 నుంచి 5.11 గంటల వరకూ తన ప్రసంగం కొనసాగించారు. ఆలోచింపజేసేలా సాగిన ఆయన ప్రసంగాన్ని ప్రజలు ఆద్యంతం ఎంతో ఆసక్తిగా ఆలకించారు. చంద్రబాబు, దత్తపుత్రుడు ఢిల్లీతో కలిసి చేస్తున్న కుట్రలను, కుతంత్రాలను సీఎం జగన్ వివరించిన ప్రతిసారీ ప్రజలు ఉత్తేజంతో ఉరకలెత్తుతూ 'సీఎం సీఎం' అంటూ కేరింతలు కొట్టారు. ఆయన పర్యటన పిఠాపురం ప్రజల్లో సరికొత్త జోష్ నింపింది. పార్టీ అభ్యర్థి వంగా గీతను బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపిస్తే ఉప ముఖ్యమంత్రిని చేసి, తన పక్కనే మంత్రివర్గంలో కూర్చొబెట్టుకుంటానని ముఖ్యమంత్రి చేసిన ప్రకటన నియోజకవర్గ ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని తీసుకునివచ్చింది. పార్టీ శ్రేణుల్లో సైతం ఉత్తేజాన్ని నింపింది. స్థానికంగా అందుబాటులో ఉండే అవకాశం లేని పవన్ కల్యాణ్ కంటే.. ప్రజలతో నిత్యం మమేకమయ్యే వంగా గీతను గెలిపించుకోవాలని సీఎం ఇచ్చిన పిలుపునకు అనూహ్య స్పందన లభించింది. గీతకు ఉప ముఖ్యమంత్రి హోదా లభిస్తే ఈ ప్రాంతానికి జరిగే ప్రయోజనాన్ని సీఎం సోదాహరణంగా వివరించడం పిఠాపురం ప్రజలను ఆలోచింపజేసింది. మూడు దశాబ్దాల అనంతరం పిఠాపురానికి మంత్రి పదవి, అది కూడా ఉప ముఖ్యమంత్రి దక్కుతుందనే ముందస్తు ప్రకటన వారిని కట్టిపడేసింది. 'మొన్న గాజువాక, భీమవరం అయిపోయింది, ఇప్పుడు పిఠాపురం వచ్చింది' అంటూ పవన్ స్థిరత్వం లేని రాజకీయాలు చేస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించిన సందర్భంలో జనం కేరింతలు కొట్టడం కనిపించింది. 'కాస్త జలుబు చేస్తేనే హైదరాబాద్ వెళ్లిపోయిన పవన్.. పిఠాపురంలో పోటీ చేసి గెలిచినా అసలు ఇక్కడి వారికి అందుబాటులో ఉంటారా' అంటూ చలోక్తులతో పవన్‌కు చురకలు అంటించారు.

నిప్పులు చెరిగిన గీత

ఎప్పుడూ ఎవరి పైనా పెద్దగా రాజకీయ విమర్శలకు దిగని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత తొలిసారిగా ప్రత్యర్థులపై నిప్పులు చెరిగారు. ఆమెకు సంఘీభావంగా ప్రజలు 'గీతమ్మా గీతమ్మా' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. పిఠాపురం నుంచి విడదీయాలనే ప్రయత్నంలో తనను అవమానిస్తున్నారని, తనను పిఠాపురానికి దూరం చేయాలని చూస్తున్నారంటూ గీత భావోద్వేగానికి గురై కంట తడి పెట్టుకోవడం సభలో ఒక్కసారిగా అలజడి రేపింది. తనను అవమానించే రీతిలో అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మకు, తనను నిలదీయాలన్న ప్రత్యర్థి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు సైతం గీత తనదైన శైలిలో చురకలు అంటించారు. తన నుంచి పిఠాపురాన్ని ఎవరు విడదీయలేరన్న గీత.. అటువంటి వారి లెక్కలు తేలుస్తానంటూ ఒకింత ఆగ్రహంతో.. అపరకాళిలా ప్రత్యర్థులను పదునైన పదజాలంతో చీల్చి చెండాడారు. దేశంలోనే కాకినాడ పార్లమెంటరీ స్థానాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు తనకొక అవకాశం కల్పించాలన్న ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ ప్రసంగానికి కూడా ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగిన తనకు రూ.400 కోట్లతో 400 గ్రామాలను అభివృద్ధి చేసే అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ ప్రచారానికి తుది గడువైన శనివారం సాయంత్రం ఆరు గంటలకు 50 నిమిషాల ముందే ముఖ్యమంత్రి జగన్ తన సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని పిఠాపురంలో ముగించారు.

క్లుప్తంగా

నోట్లు పంచుతూ దొరికిన టీడీపీ నాయకుడు

కడియం: రాజమహేంద్రవరం రూరల్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరికి ఓట్లు వేయాలని కోరుతూ కడియపుసావరం గ్రామంలో ప్రజలకు డబ్బులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు కె.నాగేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.64 వేలు స్వాధీనం చేసుకున్నారు. అతను నగదు పంపిణీ చేస్తున్నాడని 100కు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. నిందితుడిని పట్టుకుని కడియం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మద్యం విక్రయాల బంద్



అనపర్తిలో మద్యం షాపునకు సీల్ వేస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి మద్యం విక్రయాలను బంద్ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలోని 137 ప్రభుత్వ మద్యం షాపులు, 26 బార్లకు జిల్లా మద్యనిషేధ, అబ్కారీ అధికారి వై.శ్రీలత నేతృత్వంలో అధికారులు సీల్ వేశారు. సోమవారం సాయంత్రం ఆరు గంటలకు ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం మద్యం షాపులు, బార్లను తెరుస్తారు.

అప్పనపల్లి.. భక్తులతో శోభిల్లి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తజన సందోహంలా మారింది. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ఉదయమే పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు సమర్పించుకున్నారు. భక్తుల రాకతో పాత గుడితో పాటు కొత్త గుడి కోలాహలంగా మారింది. స్వామివారి ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.2.76 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2.17 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.58,583 విరాళాలుగా అందించారని చెప్పారు. 3,097 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, 2,415 మంది అన్న ప్రసాదం స్వీకరించారన్నారు. స్వామివారి సన్నిధిలో శ్రీలక్ష్మీనారాయణ హోమాన్ని అర్చకులు ఘనంగా జరిపించారు.

ఇక నోటుమాటే

- ఫైరవీలకు తెరలేపిన టీడీపీ, జనసేన
- చివరి ప్రయత్నంగా ఓట్ల కొనుగోలు
- మద్యం పంపిణీకి చర్యలు



సాక్షి, అమలాపురం: ఎన్నికల పోలింగ్‌కు ఇంకా 24 గంటల సమయం మాత్రమే ఉంది. నెల రోజుల పాటు సాగిన ప్రచారానికి తెరపడింది. వైఎస్సార్ సీపీకి ప్రచారంలో అందరి మద్దతు లభించింది. కూటమి అభ్యర్థులకు విజయావకాశాలు ఏ మాత్రం లేకపోవడంతో చివరి యత్నంగా పైరవీలకు తెరలేపారు. ఓటు కొనుగోలు, మద్యం పంపిణీపై దృష్టి పెట్టారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు తేల్చనున్నారు. గత నెల రోజుల నుంచి ప్రధాన పార్టీ అభ్యర్థులతోపాటు ఇతర పార్టీ అభ్యర్థులు, స్వతంత్రులు ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి అధికార వైఎస్సార్ సీపీకి ప్రధాన ఆయుధంగా మారింది. ఆ పథకాల బలమే తమను గెలిపిస్తోందని వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. కానీ ఆ నమ్మకం టీడీపీ, జనసేన అభ్యర్థులకు లేకుండా పోయింది. నెల రోజుల పాటు చేసిన ప్రచారం ఆయా నియోజకవర్గాల్లో పేలవంగా సాగింది. ఇంటింటా ప్రచారంలో ప్రజల నుంచి పెద్దగా స్పందన లేకుండా పోయింది. ముఖ్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ క్యాడర్ మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయం కొరవడింది. దీనికితోడు ప్రతిచోటా ఆధిపత్య పోరు కనిపించింది. ఎన్నికల నిర్వహణపై పెత్తనం కోసం ఒకరికొకరు పోటీ పడ్డారు. ఇవన్నీ విపక్ష కూటమి అభ్యర్థుల గెలుపునకు అవరోధంగా మారాయి. ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో ఫలితాలు అనుకూలంగా లేకపోవడంతో టీడీపీ, జనసేన అభ్యర్థులు పైరవీలకు తెరలేపారని తెలుస్తోంది. మండపేటలో ఓటుకు రూ.1,500, మద్యం పంపిణీ చేస్తున్నారు. రామచంద్రపురంలో ఎంపిక చేసిన ఓటర్లకు రూ.రెండు వేల వరకూ అందిస్తున్నారు. ముమ్మిడివరం, అమలాపురం, కొత్తపేటలలో సైతం టీడీపీ అభ్యర్థులు ఓటుకు రూ.వెయ్యి చొప్పున అందించడంతో పాటు మద్యం ఏరులై పారిస్తున్నారని జనం మాట. పి.గన్నవరం, రాజోలులలో జనసేన అభ్యర్థులు సీటు తెచ్చుకునేందుకే భారీగా ఖర్చు చేయాల్సి వచ్చింది. దీని వల్ల సీటు వచ్చిన నాటి నుంచి ప్రచారం కోసం క్యాడర్‌ను రప్పించడం, పార్టీ నాయకులను చేరదీయడం వంటి విషయాలకు సైతం భారీగా ఖర్చు చేస్తున్నట్టు సొంత క్యాడర్ చెబుతోంది. దీనికి కొనసాగింపుగా ఓట్ల కొనుగోలుకు భారీగా సొమ్ము వెచ్చిస్తున్నారు. ఇక్కడ ఓటుకు రూ.వెయ్యి చొప్పున, ఎన్నికల నిర్వహణకు బూత్ స్థాయి నేతలకు వచ్చి రూ.20 వేల చొప్పున, మండల పార్టీలో కీలక నేతలకు రూ.50 వేల చొప్పున అందజేసినట్టు జనం చెప్పుకొంటున్నారు.

కట్టకు 85 నుంచి 90 నోట్లే

'అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న' అన్నట్టుగా ఉంది టీడీపీ, జనసేన పార్టీలోని కొంతమంది నాయకుల పరిస్థితి. ఓట్ల కొనుగోలుకు ఇస్తున్న సొమ్ముల్లో కొంతమంది నాయకులు అడ్డంగా నొక్కేస్తున్నారు. గతంలో నోట్లకట్లకు పిన్నులు ఉండేవి. ఇప్పుడు వస్తున్న సొమ్ముకు పిన్‌లు లేకపోవడంతో కొన్ని నోట్లు లాగేయడం సులువుగా మారింది. ఈ కారణంగా డబ్బు కట్టల్లో వంద నోట్లకు బదులు 85 నుంచి 90 నోట్లు ఉంటున్నాయి. పంచుతున్న సమయంలో మాత్రమే ఈ విషయం వెలుగు చూస్తోంది. నాయకుల చేతివాటం తమకు తలనొప్పిగా మారిందని క్యాడర్ వాపోతోంది.

పిఠాపురమే నా కుటుంబం

- ఇక్కడి నుంచి నన్ను విడదీయాలని చూస్తున్నారు
- మళ్లీ జన్మంటూ ఉంటే ఇక్కడే పుడతా
- సీఎం సభలో కన్నీటి పర్యంతమైన వంగా గీత



సీఎం జగన్ సమక్షంలో భావోద్వేగంతో ప్రసంగిస్తున్న పిఠాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

పిఠాపురం: 'నన్ను పిఠాపురం నుంచి విడదీయాలని చూస్తున్నారు. అడుగడుగునా అవమానిస్తున్నారు.' అంటూ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత కన్నీటి పర్యంతమయ్యారు. శనివారం పిఠాపురంలో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభలో ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. 'నా పుట్టుక పిఠాపురానికి దగ్గర చేయకపోతే నా అంతిమయాత్రే జరుగుతుంది. 'నాకు పసుపు, కుంకుమ పెట్టి నా ఆడపడచులు, అక్కచెల్లెళ్లు, నా అన్నదమ్ములు, నా ప్రజలే నన్ను సాగనంపాలి. మళ్లీ జన్మంటూ ఉంటే పిఠాపురంలోనే పుడతాను. నన్ను అవమానిస్తూ తప్పుడు ప్రచారాలతో పిఠాపురం ప్రజలకు దూరం చేయాలని చూస్తున్న వారిని వదిలి పెట్టేది లేదు. పిఠాపురమే నా కుటుంబం. పిఠాపురం ప్రజలే కుటుంబ సభ్యులు. వారి నుంచి నన్ను ఎవరూ విడదీయలేరు' అని ఆమె అన్నారు.

ఇక్కడి నుంచి నన్నెందుకు పంపించాలి?

తనను పిఠాపురం నుంచి పంపించాలని, తనను నిలదీయాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురం ప్రజలకు చెబుతున్నారని గీత ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ తీసుకువచ్చి, రాష్ట్ర స్థాయిలో నిలిపినందుకా? హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ తీసుకువచ్చి పిఠాపురాన్ని జాతీయ స్థాయిలో నిలిపినందుకా? రూ.100 కోట్లతో 2 లక్షల మంది కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రి, తల్లీబిడ్డల రక్షణకు ప్రత్యేక ఆసుపత్రి, ఐఎఫ్‌టీ కాలేజీ నిర్మిస్తున్నందుకా? రైల్వే అండర్ పాస్‌లు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తున్నందుకా ప్రజలు నన్ను నిలదీసేది? అని ఆమె పవన్‌ను ప్రశ్నించారు. 'ఆడది అని తీసిపారేస్తున్నట్టు మాట్లాడుతున్నారు. ఆ ఆడదే ఇవన్నీ చేసి చూపించింది. ఎంపీ అంటే ఇలా ఉండాలనే విధంగా, దేశంలో ఏ ఎంపీ చేయలేని అభివృద్ధి చేసి చూపించాను' అని చెప్పారు. 'నా ప్రత్యర్థి పని చేయలేరని నేను అనడం లేదు. అంత సామర్థ్యం లేదనీ అనడం లేదు. కానీ మీరు ఫోన్ చేస్తే వంగా గీత వస్తుంది. మరి ప్రత్యర్థి రాగలడా?' అని ప్రశ్నించారు. 'మీరు ఎప్పుడు తలుచుకుంటే అప్పుడు వచ్చి నేను పని చేయగలను. ఇది ప్రత్యర్థికి సాధ్యం కాదు' అని చెప్పారు.

అబద్ధాలంటూ అవమానిస్తారా?

'వేసవి తాపంతో అనారోగ్యానికి గురై కళ్లు తిరిగి పడిపోతే నాటకాలాడుతున్నానంటూ నన్ను ఎంతగానో అవమానించారు. నాటకాలాడాల్సిన పని నాకు లేదు. నిజంగా నీరసం వచ్చింది కాబట్టే ఎక్కడికీ వెళ్లకుండా పిఠాపురంలోనే వైద్యం చేయించుకున్నాను. పవన్ కల్యాణ్‌లా హైదరాబాద్ పారిపోలేదు' అని గీత ఎద్దేవా చేశారు. 'కావాలంటే ఆ డాక్టర్లనే అడగండి. నేను నాటకాలాడానేమో తేల్చండి' అంటూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. 'అనారోగ్యానికి గురయితే అవమానిస్తారా? ఆడవారి పని తీరును అవమానిస్తారా?' అని ప్రశ్నించారు. తాను బయటి నుంచి వచ్చానంటూ టీడీపీ నేత వర్మ ప్రచారం చేస్తున్నారని, అసలు 2009లో పిఠాపురంలో ఎమ్మెల్యేగా పోటీ చేసేటప్పటికి వర్మ సొంతూరుగా చెప్పుకుంటున్న పి.దొంతమూరు ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉండేదని, పునర్విభజనలో ఆరు గ్రామాలు కలిపితే పి.దొంతమూరు పిఠాపురంలో కలిసిందని, అప్పటి వరకూ వర్మ పక్క నియోజకవర్గం వాడేనని చెప్పారు. స్థానికత గురించి మాట్లాడే హక్కు ప్రత్యర్థులకు లేదని అన్నారు. ఆడవారిని ప్రశ్నించే ముందు మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండని సూచించారు.

వెటకారం చేస్తారా?

కడుపుతో ఉన్న తల్లికి, బిడ్డకు కరోనా వస్తే పుట్టిన బిడ్డకు తల్లి పాలు లేకపోతే కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో తల్లి పాలు అందించింది తానని, కరోనా సోకిన వారికి వైద్య సేవలందించేలా చూసింది తానని గీత చెప్పారు. రెండుసార్లు కరోనా వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉండి వారికి వైద్యం అందేలా చేసింది తానేనని అన్నారు. రాజకీయాలు రాజకీయాలుగా చేయాలని, అంతే కానీ ఇంత వెటకారం చేస్తారా అని టీడీపీ, జనసేన నేతలపై మండిపడ్డారు. 'వంగా గీత ఏసీలో తిరుగుతారు. బయటకు రారని అంటూ టీడీపీ నేత వర్మ వెటకారం ఆడుతుంటారు. అసలు నేనేమిటో 1995 నుంచి ఇప్పటి వరకూ గత పత్రికలను, టీవీ చానళ్లలో వచ్చిన కథనాలను, ఇప్పుడు వచ్చిన యూట్యూబ్, వాట్సాప్, సోషల్ మీడియా మొత్తం చెక్ చెయ్. జీఓలు చూస్తే గీత చేసిందేమిటో కనిపిస్తుంది' అని వర్మకు సవాల్ విసిరారు. 'తాను పిఠాపురంలో పుట్టలేదంటున్నారని, అలా అంటున్న వారు ఇక్కడ పుట్టారా?' అని ఆమె ప్రశ్నించారు. ఎవరు ఎక్కడ పుట్టాలనేది ఎవ్వరి చేతిలోనూ ఉండదన్నారు. ఎవరి అదృష్టం ఎలా ఉంటుందో ఎవరికి తెలుసని ప్రశ్నించారు. భావోద్వేగానికి గురైన గీతను సీఎం జగన్ ఓదార్చారు.

400 గ్రామాల అభివృద్ధి

వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ, తనను గెలిపిస్తే కాకినాడ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని 400 గ్రామాలను రూ.400 కోట్లతో అభివృద్ధి చేస్తానని అన్నారు. యువతను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించడానికి రూ.100 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తానని, యువత పరిశ్రమలు స్థాపించి, ఆర్థికంగా నిలబడటానికి చేయూతనిస్తానని చెప్పారు. రూ.40 కోట్లతో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఏటా 5 వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం తనను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పిఠాపురం సిటింగ్ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, వైఎస్సార్ సీపీ, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి



శశికుమార్ (ఫైల్)

ఆత్రేయపురం: గోదావరిలో ఈతకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక వద్ద చోటుచేసుకుంది. ఆ వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం దొండపూడికి చెందిన గొర్రె వీరవెంకట శశికుమార్ (18) తోటి స్నేహితులతో పిచ్చుకలంక వద్ద గోదావరిలో స్నానానికి వెళ్లాడు. ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు మృతుడి తండ్రి బంగార్రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ వివరించారు.

వీరేశ్వరా... సర్వేశ్వరా..

- మురమళ్ల ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- ఐదు రోజులు.. ఆధ్యాత్మిక సంబరాలు

ఐ.పోలవరం: నిత్య కళ్యాణం.. పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని మహిళలు ఆలయ ఆవరణలో పసుపు కొమ్ములను దంచి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. శైవాగమ పద్ధతిలో రాష్ట్ర ఆది శైవ అర్చక సంఘ అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకస్వాములు, అధికారుల పర్యవేక్షణలో ఐదు రోజుల క్రతువుకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామి వారికి పంచామృత అభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వధూవరులను సంప్రదాయ పద్ధతిలో చేశారు. బ్రహ్మోత్సవ కల్యాణ మూర్తులకు జంపన రామకృష్ణంరాజు, ప్రసన్న రాణి దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. స్వామి, అమ్మవార్లను భద్రపీఠంపై ఉంచి గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. నిత్యం జరిగే స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ, యాగశాల తదితర ఏర్పాట్లు చేశారు. నిత్యం కల్యాణ కాంతులతో వెలిగే ఆలయానికి బ్రహ్మోత్సవ శోభ తోడవడంతో మరింత ఆధ్యాత్మిక శోభ వచ్చింది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షిస్తున్నారు.



భద్రకాళీ సమేత వీరేశ్వరునికి పంచామృత అభిషేకం చేస్తున్న అర్చకులు



భద్రపీఠంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు



పసుపు దంచుతున్న ముత్తైదువలు

గోవిందా.. హరి గోవిందా..

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం



భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఉదయం స్వామి వారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఆలయ ఆవరణలో అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామికి పూజలు చేశారు. ఈ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయం, ఆన్‌లైన్ ద్వారా సుమారు రూ.34,21,246 ఆదాయం సమకూరిందన్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా పందిర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మైకు మూగబోయింది

సాక్షి, అమలాపురం: సార్వత్రిక ఎన్నికల ప్రచారం ముగిసింది. నెల రోజుల పాటు హోరెత్తించిన మైక్‌లు మూగబోయాయి. పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి ఎటువంటి ప్రచారం చేయకూడదనే ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారాన్ని ముగించారు. ఈ సారి ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు సైతం ప్రచారాన్ని జోరుగా నిర్వహించడం విశేషం. జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాలకు సోమవారం ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ప్రధాన అభ్యర్థుల మధ్యే పోటీ ఉండనుంది. అమలాపురం పార్లమెంట్‌తో పాటు మండపేట, ముమ్మిడివరం, కొత్తపేట, రామచంద్రపురం, అమలాపురం స్థానాల్లో వైఎస్సార్ సీపీ, టీడీపీల మధ్య, పి.గన్నవరం, రాజోలు అసెంబ్లీ స్థానాలలో వైఎస్సార్ సీపీ, జనసేనల మధ్య ప్రధాన పోటీ జరుగుతోంది. ప్రధాన పార్టీల ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. సాయశక్తులు ప్రదర్శించారు. ప్రచారంలో అధికార పార్టీ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. ఈ పార్టీకి ఒకేసారి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించడం కలిసి వచ్చిన అంశమని చెప్పాలి. అప్పటి నుంచి అభ్యర్థులు జనం మధ్యనే ఉన్నారు. పోటీలో ఉన్న ఎమ్మెల్యేలు గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో రెండేళ్లుగా జనంలోనే ఉంటున్నారు. ఇవన్నీ వారి ప్రచారానికి కలసి వచ్చే అంశాలు. ఇంటింటా ప్రచారాలు, భారీ ర్యాలీలు నిర్వహించారు. ఆటోలు, మోటారు సైకిళ్లకు మైక్‌లు పెట్టి ప్రచారం హోరెత్తించారు. వినూత్నంగా ఎల్‌సీడీలో వీడియోలతో సైతం ప్రచారం చేశారు. అధికార పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో రెండుసార్లు పర్యటించారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలో బస్సు యాత్ర నిర్వహించగా, పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేటలో ఎన్నికల సభలో ప్రసంగించారు. ఈ రెండుసార్లు జరిగిన సభలు జన ప్రభంజనాన్ని తలపించింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ప్రచారానికి సీఎం పర్యటన మరింత జోష్ తెచ్చింది. వైఎస్సార్ సీపీతో పోల్చుకుంటే టీడీపీ, జనసేన అభ్యర్థుల ప్రచారం పేలవంగా సాగింది. పి.గన్నవరం, అమలాపురం, రాజోలు, రామచంద్రపురం అసెంబ్లీ స్థానాలకు, అమలాపురం పార్లమెంట్ స్థానానికి కూటమి అభ్యర్థుల ప్రకటన ఆలస్యమైంది. పైగా అభ్యర్థుల ఎంపిక రెండు పార్టీల్లో అసంతృప్తులకు దారితీసింది. పి.గన్నవరంలో టీడీపీ అభ్యర్థిని ప్రకటించి తరువాత జనసేనకు ఇచ్చింది. ఇక్కడ జనసేన నేతలు విధ్వంసానికి సైతం పాల్పడ్డారు. అలాగే రామచంద్రపురం టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ప్రకటన సైతం ఆ పార్టీలో వివాదానికి కారణమైంది. ఈ తలనొప్పుల కారణంగా ప్రచారంలో వారు వెనుకబడిపోయారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత రావులపాలెంలో విడిగా, పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట, అమలాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పవన్‌కల్యాణ్, చంద్రబాబులు రామచంద్రపురం, మండపేటల్లో ప్రచారం చేశారు. అధినేతలు పర్యటించినా ఆ పార్టీకి పెద్దగా కలసి రాలేదనే చెప్పాలి.